క్లుప్తంగా

వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి: వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్ర వారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

కేజీబీవీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు

సబ్బవరం: కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ(కేజీబీవీ)ల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు తెలిపారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన కేజీబీవీ ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ శేషగిరి, జీసీడీవో ఏఎస్‌డీ జెమీమా, ఏఎంవో కెజియా, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

కృష్ణాష్టమికి ప్రత్యేక ఏర్పాట్లు



సమావేశంలో పాల్గొన్న పురుషోత్తపురంలోని ఆలయ కమిటీ ప్రతినిధులు

పెందుర్తి: ఈ నెల 16న జరగనున్న కృష్ణాష్టమి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పురుషోత్తపురం వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త చందు యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చందు యాదవ్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్ల ఏర్పాటు, మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. ఆ రోజు సాయంత్రం ఉట్టి సంబరం అంబరాన్ని అంటే రీతిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పలు అంశాలపై చర్చించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చీర అప్పలరాజు, ఆబోతు శ్రీను, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మొగలిపురం రైతు సేవా కేంద్రం ఆకస్మిక తనిఖీ

సబ్బవరం: మండలంలోని మొగలిపురం రైతు సేవా కేంద్రాన్ని సబ్బవరం ప్రాంతీయ పశు వైద్యశాల ఇన్‌చార్జ్ సహాయ సంచాలకుడు డాక్టర్ చిట్టినాయుడు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం అంతకాపల్లి, గుల్లేపల్లి పశు వైద్యశాలలను సందర్శించి బ్లాంకెట్ సర్వే, ఉచిత థైలేరియా, లంపీస్కిన్ టీకా కార్యక్రమ అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రూ.150కే అందుబాటులో ఉన్న లింగ నిర్ధారిత వీర్యం గురించి పాడి రైతులందరికీ తెలపాలన్నారు. కార్యక్రమంలో గుల్లేపల్లి, అంతకాపల్లి పశు వైద్యాధికారులు సంధ్య, అరుణ, పశు సంవర్ధక సహాయకుడు త్రినాథ్ పాల్గొన్నారు.

‘ఆదర్శ్’లో ముగిసిన వాయిస్ క్రాఫ్ట్ శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో ఆదర్శ్ కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న వాయిస్ క్రాఫ్ట్ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. మొత్తం 195 మంది విద్యార్థులకు నాలుగు బ్యాచ్‌లుగా నెల రోజులు శిక్షణ అందించారు. ప్రతిభ కనబరిచిన వారికి శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎన్‌ఈ ఫ్లోరా చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం వితరణ



యూనిఫాం అందిస్తున్న మానవత్వ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

పెందుర్తి: మానవత్వ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్ష్మీపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెలుపు రంగు యూనిఫారం పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 25 మంది విద్యార్థులకు వీటిని అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు భీశెట్టి శివాజీ, వడలి గోపాలరావు, భీశెట్టి వెంకటసాయి అఖిల్, హెచ్ఎం సన్యాసినాయుడు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- రోడ్లకు ఇరువైపులా పుట్టగొడుగుల్లా దుకాణాలు
- సబ్బవరం కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు
- వారపు సంతల సమయంలో మరింత రద్దీ
- పట్టించుకోని పోలీస్, రెవెన్యూ యంత్రాంగం



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో ఫుట్‌పాత్‌పై ఏర్పాటుచేసిన దుకాణాలు

మండల కేంద్రం సబ్బవరంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఫుట్ పాత్‌లు, డ్రైన్‌లు వ్యాపార కేంద్రాలుగా మారిపోతున్నాయి. వీటిని ఆక్రమిస్తూ వాణిజ్య కార్యకలాపాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ‘మామూళ్ల’గా మిన్నకుండిపోవడంతో పుట్టగొడుగుల్లా వీటి సంఖ్య పెరుగుతోంది. ఇక్కడికి వచ్చే వినియోగదారులు కూడా తమ వాహనాలను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పార్క్ చేస్తున్నారు. దీంతో విశాలంగా ఉండే రోడ్లు సైతం ఇరుకుగా మారి నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి.

వ్యాపార కేంద్రాలుగా ఫుట్‌పాత్‌లు, డ్రైన్లు!

సబ్బవరం: మండల కేంద్రంలోని అనకాపల్లి–విశాఖపట్నం రోడ్డులో రోడ్డు పొడవునా ఫుట్ పాత్‌లు, డ్రైన్‌లపై షాపులు, వాణిజ్య సముదాయాలు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. దీంతో విశాలంగా ఉండే రోడ్లు సైతం ఇరుకుగా మారుతున్నాయి. వీటితో పాటు ఆయా షాపులకు వచ్చే వినియోగదారులు షాపులకు అడ్డుగా రోడ్డుపై వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి.

వీటితో పాటు సబ్బవరం మూడు రోడ్ల కూడలి నుంచి చోడవరం వైపు వెళ్లే రోడ్లను సైతం ఫుట్ పాత్‌లు, డ్రైన్లు ఆక్రమించి వాణిజ్య కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. దీన్ని నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు.

అభివృద్ధి వెంటే ట్రాఫిక్ ఇక్కట్లు

అనకాపల్లి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు ఏజెన్సీ ప్రాంతాల నుంచి విశాఖ వైపు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. దీంతో వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. వీటితో పాటు సబ్బవరం ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుతోంది. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, మారిటైం విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ వంటి జాతీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటుతో ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో మౌలిక వసతులు, రోడ్ల విస్తరణతో అభివృద్ధి కార్యకలాపాలు ఊపందుకున్నాయి. దీంతో వాహనాల రాకపోకలు పెరిగి ట్రాఫిక్ ఇక్కట్లు కూడా సర్వసాధారణమవుతున్నాయి.



ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఆదివారం సంత వద్ద రోడ్డు పొడవునా నిలిపిన ద్విచక్రవాహనాలు



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో రోడ్డుపైనే నిలిపిన ద్విచక్ర వాహనాలు

విస్తరణ.. ఆక్రమణ

మండలం మీదుగా వెళ్తున్న జాతీయ రహదారులు సైతం విస్తరించడంతో ఈ ప్రాంతం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోంది. విస్తరణకు పట్టినంత సమయం కూడా ఉండట్లేదు.. వీటి ఆక్రమణకు. డ్రైన్లు, ఫుట్‌పాత్‌లే ఆధానంగా షాపులను ఏర్పాటు చేసుకుని పాగా వేస్తున్నారు. ఈ షాపులకు వచ్చే వినియోగదారులంతా ఆయా షాపుల ముందు వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేస్తూ ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నారు. డ్రైన్లు సైతం ఆక్రమణకు గురై ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో పూడుకుపోతోంది. పలుచోట్ల మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ మురికివాడల్ని తలపిస్తున్నాయి.

వారపు సంత.. మరింత చింత

సబ్బవరంలో వారపు సంత ఆదివారం, గురువారం జరుగుతుంది. ఆదివారం సంత అతిపెద్దది కావడంతో సబ్బవరంలో ప్రధాన కూడళ్లు అన్నీ దాదాపుగా కిక్కిరిసి ఉంటాయి. బజార్‌కు వచ్చేవారితో పాటు నిత్యం గ్రామీణ ప్రాంతం నుంచి భవన నిర్మాణ కార్మికులు చాలా మంది వస్తుంటారు. వీరంతా ఆదివారం, గురువారం సంతల్లో లభించే సరకుల తోపాటు, నిత్యావసర సరకుల కొనుగోలుకు ఈ ఫుట్‌పాత్ షాపులకు వెళ్తుండటంతో షాపులన్నీ కిటకిటలాడుతూ రోడ్లు మరింత రద్దీగా ఉంటాయి. దీంతో సంత రోజుల్లో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారుతోందని స్థానికులు చెప్తున్నారు.

ఆక్రమణలు పరిశీలించి చర్యలు



సబ్బవరంలో ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న డ్రైన్‌లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను పరిశీలిస్తాం. షాపులు, నిర్మాణాలు ఉంటే వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే సబ్బవరంలో సీసీ డ్రైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశాం. అనుమతులు వస్తే రోడ్డును అనుకుని ఉన్న ఆక్రమణలను తొలగించి, పక్కా డ్రైన్లు నిర్మిస్తాం.

– కె.శివరామ్ ప్రసాద్ నారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో, సబ్బవరం

అవగాహన కల్పిస్తున్నాం



సబ్బవరం ప్రధాన రహదారి కావడం, అనేక విద్యా సంస్థలు కొత్తగా ఏర్పడటంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. రోడ్డు పొడవునా ఉండే వాణిజ్య సముదాయాలు, షాపుల ఎదుట నిర్లక్ష్యంగా పార్కింగ్ చేసి వెళ్లిపోయేవారిపై చర్యలు తీసుకుంటున్నాం. తరచూ ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– జి.రామచంద్రరావు, సీఐ, సబ్బవరం పోలీస్ స్టేషన్

మారిటైం వర్సిటీ వద్ద నిర్వాసితుల ఆందోళన



వంగలి మారిటైం విశ్వవిద్యాలయం ఎదురుగా నిరసనలో గ్రామస్తులు

సబ్బవరం: వంగలి మారిటైం విశ్వవిద్యాలయ యాజమాన్యం మొండి వైఖరి వీడి, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయం ఎదురుగా తమ డిమాండ్ల సాధన కోసం గ్రామస్తులు, భూ నిర్వాసిత రైతులు శుక్రవారం ధర్నా చేశారు. గ్రామ పెద్ద ఆకుల గణేష్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఏర్పాటు సమయంలో గ్రామస్తులకు, నిర్వాసితులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, తర్వాత కంటి తుడుపుగా ఒకరిద్దరికి ఉపాధి కల్పించి మిన్నకుండిపోయినట్లు పేర్కొన్నారు. దీనిపై అనేక పర్యాయాలు వినతులు అందించినా న్యాయం జరగలేదని వాపోయారు. ఈ ఏడాది జనవరిలో 5 రోజుల పాటు వర్సిటీ ఎదురుగా వంటావార్పు చేస్తూ, 500 మంది గ్రామస్తులు ధర్నాకు దిగితే, వర్సిటీ యాజమాన్యం, స్థానిక ఎమ్మెల్యే సమక్షంలో తమ డిమాండ్లు నెరవేరుస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఏడు మాసాలవుతున్నా ఇప్పటికీ వాటి ఊసే లేదన్నారు. యాజమాన్యం మొండి వైఖరిపై అవసరమైతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొర్లి అప్పలనాయుడు, జెట్టి ప్రసాద్, గవర శ్రీను, జెట్టి ముత్యాలనాయుడు, జెట్టి హేమంత్, యర్ర సతీష్, కంద రాము, బలిరెడ్డి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గనిశెట్టి సత్యనారాయణ

సబ్బవరం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు సంక్షేమ బోర్డు నిధులను వారికే వెచ్చించాలని సిటు అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సబ్బవరంలోని సిటు భవన నిర్మాణ కార్మికుల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే పరిహారంగా చెల్లించాలన్నారు. పెళ్లి, ప్రసవ సమయాల్లో చెల్లించాల్సిన ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం నిలిపేయడం సరికాదన్నారు. సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వాలు తమ అవసరాలకు వాడుకోవడం అన్యాయమన్నారు. వెంటనే కార్మిక సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభ ఈ నెల 5న రాంబిల్లి మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పూడి అప్పలనాయుడు, గొంప ముత్యాలు, జి.అప్పారావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

పరవాడ: ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా వెన్నలపాలెం గ్రామంలో కొత్తగా 16 మందికి మంజూరైన పింఛన్లను జనసేన పార్టీ మండల ఇన్‌చార్జ్ పంచకర్ల ప్రసాద్ శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరవాడ ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెన్నల నరసింగరావు, సర్పంచ్ వెన్నల అప్పారావు, ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, టీడీపీ నాయకులు రతాలు సన్యాసిరావు, వరలక్ష్మి పలువురు నాయకులు పాల్గొన్నారు.

• పెదముషిడివాడలో పింఛన్లను సర్పంచ్ పల్లా నాగమణి, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు యలమర్తి బుజ్జి, బలిరెడ్డి అరుణ్, సేనాపతి త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

రెండు చోరీ కేసుల్ని ఛేదించిన పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ మోహన్‌రావు, సీఐ మల్లికార్జునరావు

పరవాడ: ఇటీవల పరవాడలో జరిగిన రెండు దొంగతనం కేసులను ఛేదించినట్లు పరవాడ ఇన్‌చార్జి డీఎస్పీ బి.మోహన్‌రావు వెల్లడించారు. ఈ దొంగతనాలకు సంబంధించి ఒకరిని అరెస్టు చేసి, మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.45 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. వెన్నలపాలెం సినిమాహాలు జంక్షన్‌లోని పైల వెంకటరావు నివాస గృహంలో గత నెల 22న పట్టపగలు జరిగిన దొంగతనంలో మూడు తులాల నల్లపూసలు, అర తులం బంగారు రింగులు అపహరించారు. అదే గ్రామంలో గత 29న రెడ్డి శివ ఇంట్లో చొరబడి అర తులం బంగారు చెవి దిద్దులు, రూ.60 వేల నగదును దొంగిలించారు. ఈ ఫిర్యాదులపై డీఎస్పీ ఆదేశాల మేరకు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు దర్యాప్తు ప్రారంభించి, రెండు దొంగతనాలకు పాల్పడింది ఒకరేనని తేల్చారు. కంచరపాలెంలో ఉంటున్న సబ్బవరపు కృష్ణంనాయుడు(27) ఈ దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఇతడి స్వస్థలం చోడవరం ఎడ్ల వీధి కాగా, 20 ఏళ్లుగా ఇతని కుటుంబం కంచరపాలెంలో నివసిస్తోంది. నిందితుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసగా మారి, ఈ దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. నిందితుడు ఉపయోగిస్తున్న స్కూటీని స్వాధీనం చేసుకుని, అతన్ని అరెస్టు చేసి అనకాపల్లి కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు. చోరీ కేసుల్ని ఛేదించడంలో కృషి చేసిన పరవాడ డీఎస్పీ, ఇన్‌చార్జ్ డీఎస్పీ, సీఐ తోపాటు, క్రైం సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ ఎస్.వి.సాయిసంతోష్, కానిస్టేబుళ్లు నాయుడు, నాగేంద్ర బాబు, పి.కిశోర్‌కుమార్‌లను అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



పెందుర్తిలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ఫాతిమా బేగం

పెందుర్తి: తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి, గీత అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పాత పెందుర్తి, పెందుర్తి ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలు పట్టడం వలన రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఆరు నెలల తరువాత తల్లిపాలతో పాటు సమాంతరంగా అనుబంధ ఆహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

పరవాడ: పిల్లలకు తల్లి పాలను తాగించడం వలన వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని వాడచీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారిణి ఫాతిమా బేగం అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. తల్లిపాలల్లో బిడ్డ శరీరానికి సరిపోయే పోషక విలువలు లభించడమే కాకుండా తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ నెల 7 వరకు వారోత్సవాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణి, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు

పెందుర్తి: వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు పారదర్శకంగా మెరుగైన సేవలు అందించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి సత్తిబాబు సూచించారు. శుక్రవారం పెందుర్తిలోని వసతిగృహాలు, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించిన ఆయన అక్కడి పనితీరును సమీక్షించారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి వినతిని క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో విచారణ చేసి, నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో అప్పలరాజు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వీఎంఆర్‌డీఏ కన్వెన్షన్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో పూర్తయిన వీఎంఆర్‌డీఏ కన్వెన్షన్‌ను ఆదివారం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కూటమి నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అదే రోజు వీఎంఆర్‌డీఏ నిధులు రూ.76.33 కోట్లతో వివిధ పనులకు శ్రీకారం చుడతామన్నారు. సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అయిత సింహాచలం, మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, నాయకులు శానాపతి సోమశేఖర్, గళ్లా శ్రీనివాస్, పిన్నింటి పార్వతి పాల్గొన్నారు.

సిరులొసంగవే.. శ్రీమహాలక్ష్మి

- ఘనంగా శ్రావణమాస రెండో శుక్రవారం పూజలు
- భక్తులతో కిటకిటలాడిన అమ్మవార్ల దేవాలయాలు



ఎస్‌ఆర్ పురంలో లక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ



చినముషిడివాడలో పూజలందుకున్న అలివేలు మంగమ్మ



సుజాతనగర్‌లో పూజలందుకున్న కనకదుర్గమ్మ



సాధుమఠం వద్ద విశేషాలంకరణలో సంతోషిమాత



విజినిగిరిపాలెంలో కొలువుదీరిన ఉమాదేవి



వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి



అలివేలు మంగమ్మ సన్నిధిలో భక్తులు

పెందుర్తి: పవిత్ర శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా నియోజకవర్గం ఆధ్యాత్మిక చింతనలో ఓలలాడింది. శ్రావణలక్ష్మి నామస్మరణతో ఊరూవాడా మార్మోగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని అమ్మవార్ల దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

• చినముషిడివాడ దరి అలివేలు మంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పసుపు–కుంకుమలు, పాలు, పంచామృతాభిషేకాలు సమర్పించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు జరిపారు. లక్ష్మి, విష్ణు సహస్రనామార్చనలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

• ఎస్‌ఆర్ పురంలో కొలువైన కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారు లక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

• సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

• శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రిమాత ఆలయంలో వందలాది మంది భక్తులు కుంకుమ పూజలు చేశారు.

• సాధుమఠం సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు, హోమాలు జరిగాయి.

• పెందుర్తి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

• పెందుర్తిలోని మహా కామేశ్వరి ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

సింహాచలం: అడవివరంలోని పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు విశేషంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవికి కుంకుమార్చనలు చేశారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తరం పూజ నిర్వహించారు.

• విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన ఉమాదేవిని పలు రకాల పుష్పాలు, పసుపు కుంకుమలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణ శర్మ ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

లులుతో ఒప్పందం రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపూర్ ప్రతినిధులు

పెందుర్తి: లులు సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న తప్పుడు ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపూర్ జిల్లా కార్యదర్శి దేవ డిమాండ్ చేశారు. పెందుర్తిలో పలువురు ప్రజా సంఘాల నాయకులతో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా దేవ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 176 వాగ్దానాలను గాలికి వదిలేసి, ప్రభుత్వ స్థలాలను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తోందని ఆక్షేపించారు. ప్రభుత్వ రంగం సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయకుండా కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాయడం సరికాదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తే ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.